# కవితా కౌముది

## తూర్పు రాగాలు — డేగల అనితా సూరి



మెలకువ నిద్రపోయాక
మౌనం మేల్కొంటుంది,
చలికొరికిన చందమామ
కళ్ళదోసిట్లో నక్షత్రాల్నిపోసి
వెన్నెలచాటున నవ్వుకుంటుంది,
పోగులు పోసిన పరిమళాలతో
ఊహల తీగలు పెనవేసి
జ్ఞాపకాల వృక్షాన్ని అల్లుకుంటుంది,
ఇసుకతిన్నెల్లో ఈదులాడినబాల్యం
మరోసారి మేఘాలవీధిలో
అల్లరిచేస్తూ దోబూచులాడ్తుంది,
జలపాతమై దూకిన యవ్వనం
మలయమారుతమై
చక్కిలిగింతలు రాజేస్తుంది,
అప్పటివరకూ గంతలుకట్టుకున్న
బాధ్యతల దొంగ ఛప్పున తేరుకుని
మైమరుపు ఝాముల్నిదోచుకెళ్తుంది,
కొబ్బరాకుల చివర్లకు పూసిన
మంచు పూల మొగ్గలు
వేకువ నెచ్చెలి చెక్కిటజారి
చెదిరిపోయిన కలలతో
వాకిట్లోవాలిన కువకువలముగ్గు
చీకటి గంపెత్తి వెలుతురుకోడి
రెప్పల రెక్కల్ని తట్టి లేపుతుంది!
తూర్పువాకిట్లో మళ్ళీ
సందడి ఒళ్ళువిరుచుకుంటుంది!!



★★★

# పిల్లల్లేని తావు

బండారి రాజ్ కుమార్

పిల్లల కోడి
పొద్దున్నే హాజరు వేయించుకుంది
మట్టినంతా గోర్లకొట్టి
పిల్లలకు బతుకుడెట్లనో నేర్పిత్తాంది
గంటకొట్టి పొంటెలు గడిశినా
పసిపాదాల ముద్దెర్లు దొరక్క
గాయిగాయి తిరిగి
ఇప్పుడే సడుగెక్కింది!
తాడిచెట్టు మీది రెండు ఉడుతలు
తొంగి తొంగి కిటికీకెళ్లే సూత్తానయి
ఏ అలికిడీ ఇనబడ్తలేదని సూశీసూశీ
అలిగి పొదల్లోకెళ్లి దాక్కున్నయి!
రోజూ తాళమేసినట్టు
లయబద్ధంగ సంగీతం విన్పించేది
సందడిసందడిగా
సీతాకోకచిలుకల గుంపు
ఒక్కటీ సూపుకు ఆనట్లేదు
వికసించే మొగ్గలేవీ కనబడలేదని కాబోలు!
ఎర్రటి ఎండ జొప్పుతాంది
బువ్వాల్లయిందేమో...
నకనకలాడుతూ ఓ కుక్క
తోకూపుకుంటొచ్చింది
సాయితగాళ్లెవలూ లేరని
మొఖం న్యాలకేసుకుని
సొంగకార్సుకుంట ఎల్లిపోయింది!

గది నిండా శూన్యమే
మదినిండా శూన్యమే
ఊపిరాడక నిస్తేజంగ కుర్సీలు..బెంచీలు
ఒక్క కొమ్మా ఊగుతలేదు
గరికలు సుత తల్కాయలూపుతలెవ్వు
ఏ పిట్టా సుట్టపు సూపుకన్నా వచ్చి పోతలేదు
ఒక్కో మెతుకును మోసుకెళ్లే
చీమల బారు జాడే లేదు!!
బడి చాలయింది
పిల్లలెవలూ రాలేదు
బడిలో పిల్లలుంటే..ఆ సంబురమే వేరు
వరిగొలుసుల పైరు కళకళలాడినట్టు నిండుదనం వుంటది
మత్తడిబోసిన చెరువు దునికినట్టు చైతన్యం ఉరకలేత్తది
సూశి తరించే మనిషి మొఖంల జీవం ఉట్టిపడుతది!
పిల్లలు రాక వెలవెలబోతున్న సర్కారీ బడిని సూడు
మొరందేలిన వాకిలి మొఖం లెక్క ఎంత ఇకారంగున్నదో !
కల్లం లేశిన పొలంల అడుగు వొడ్లు సుత దొరకని ముసలవ్వ
దిగుల్లెక్క వున్నది
కైకిలిబోయిన అవ్వ మీద బెంగటిల్లి బిక్కుబిక్కుమన్నట్టున్నది
మాడుకు నూనె రాయక రేగిన పసిపొల్ల జట్టు తలీకున్నది!
ఎన్నడో...మా తాత పంపిన కారటు ఇప్పుడే ముట్టింది
"దొరలిడ్శిపెట్టిన గడీ పడావు బడ్డట్టు
పిల్లల్లేని తావు పీనుగుల కొట్టమైతది"అని రాశి పెట్టిండు

★★★

# జీవనరాగాలు

అనంతలక్ష్మి

ఎప్పటెప్పటివో కలలన్నీ
ఒకేసారి కుప్పబోసినట్లు
జీవితం అకస్మాత్తుగా
ఊపందుకుంటే
వాస్తవం సుమధురమౌతుంది!
తప్పొప్పుల గుంజాటనలో
నలిగి అలసిన మనసు
ఊరటకై ఉర్రూతలూగుతుంది!
ఊహించని మలుపుల్లో
పొంచి ఉన్న సమస్యల హారం
అధాటుగా మీదపడి
ఉక్కిరిబిక్కిరి చేసినా
ఎద లోపలి జీవన రాగమేదో
వెన్నుతట్టి నడిపిస్తుంది!
నిరాశల కాల మేఘం కమ్మేసి
నిస్పృహల ఉరుములు బెదిరించినా
సాంత్వన ల చిరుజల్లులు కురిసి
మనసు మాగాణిని తడిపితే
తేట పడిన మనో భూమి తిరిగి
మొలకెత్తుతుంది!
కొత్త ఆశ మొలకెత్తి మారాకువేస్తుంది!!

★★★



# నువ్వు - నేను

రాజ్ పాలెపు

ఇక్కడ ఇన్నేళ్ళైనా ఊపిరి పోసుకోని
ఉనికి కోసం ఆరాట పడుతూ నేను
అక్కడ అంపశయ్య మీద ఉన్న
అస్థిత్వాన్ని కాపాడాలని నువ్వు !
పొద్దంతా ఒడిసి పట్టుకోవాలని
పడమర వైపుకు పరిగెడుతూ నేను
తూరుపు తీరంలో కూర్చుని
నీరెండని ఆస్వాదిస్తూ నువ్వు!
మునిమాపులో కమ్ముకొచ్చే
కారు చీకటికి భయపడ్తూ నేను
గోధూళితో గగనపు యవనికపై
కొత్త చిత్రాలు చిత్రిస్తూ నువ్వు !
అందని స్వర్గం కోసం ఆకాశానికి
నిచ్చెన వేస్తూ నేను
అందినంతలో స్వర్గాన్ని సృష్టించాలని
అహరహం శ్రమిస్తూ నువ్వు !
ముందుతరాల తలరాతల్ని రాసే
ప్రయత్నంలో తలమునకలై నేను
గట్టుపై నిల్చుని గత తరాలకు
వారధి నిర్మిస్తూ నువ్వు !
అనుభవాల కొలిమి లోంచి
అనిశ్చిత భవిత పైకి కత్తులు దూస్తూ నేను
అనుభూతుల లోగిలిలో
అనంద గీతికలు ఆలపిస్తూ నువ్వు !
కదిలే కాలానికి కేంద్ర బిందువై
నా నువ్వు
నిన్నందుకోవాలని నిన్నటికీ రేపటికీ
ఊగిసలాడే లోలకమై నీ నేను !!

★★★

# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

ఎన్నడెడబాటునెరుగని యీ ముదమ్ము
నిజము జీవితమెల్లను నిలచి యుండు
దూరమైపోయి చివరకు చేరువైన
కలుగు తృప్తికిని విలువ కట్టలేము

కంటికెన్నడైనను నీవు కానబడక
ఎచటికో దూర తీరాలకేగినపుడు
లిప్త పాటైన క్షణములో లేశమైన
కొలదిగానైన నినుగాంచ తలచుచుందు

ఏవిధమ్మైన యనుభూతి యెక్కువంచు
నుడువనేరను రెంటిని బడయజాతు
ప్రతి దినమ్మును నీ తోడు వలయు నాకు
వలపునినుమడించెడునెడబాటు వలయు

ఏ మహత్తర శక్తియో యిచ్చె నాకు
ఉల్లముప్పొంగ రెంటిని యొక్క సారి
చెంతనుందువెప్పుడు నిజజీవితమున
వదలి దగ్గరౌదువు నాదు స్వప్నమందు

కలయిక నిజము, వచ్చిన కలయు నిజము
జీవితమ్మిది, కల కూడ జీవితమ్మె
క్షణికమీ జీవితము, క్షణికమ్మె కలయు
రెండు మన జీవితములివి, రెండు కలలు



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS